పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 703 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ సోమవారం 31.08.2026 పేజీలు : 8 వెల : 4/-

## మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

# వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం

### సీఎం చంద్రబాబు ట్వీట్

- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం
- నేడు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు





అమరావతి, ఆగస్టు 30 : మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తరువాయి 2లో




## వెలిగొండ సొరంగంలో

### కృష్ణా జలాల ప్రవాహం చరిత్రాత్మకం

- ఇవాళ తొలిసారిగా సొరంగంలోకి ప్రవహించిన కృష్ణా జలాలు
- ఇది చరిత్రాత్మక ఘట్టమన్న మంత్రి నారా లోకేశ్
- ఫేజ్-1తో లక్షలాది మందికి సాగు,

**తాగునీటి ప్రయోజనం**

మూడు దశాబ్దాల సుదీర్ఘ స్వప్నం ఎట్టకేలకు సాకారమైందని, వెలిగొండ ప్రాజెక్టు సొరంగం గుండా తొలిసారిగా కృష్ణా జలాలు ప్రవహించడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ పేర్కొన్నారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు తరతరాలుగా ఎదురుచూస్తున్న క్షణం ఆవి తరువాయి 2లో

## జెండాను కాలితో తన్నుతూ

### ఖలిస్థానీల కండకావరం.. కేంద్రమంత్రి వార్నింగ్

- న్యూయార్క్‌లో ఖలిస్థానీ మద్దతుదారుల దుశ్చర్య
- భారత జాతీయ పతాకాన్ని కాలితో తొక్కిన ఆందోళనకారులు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- దేశాన్ని, జెండాను అవమానిస్తే సహించేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు 2లో



## నేపాల్‌లో మరో జల ప్రళయం

### మరో హై అలర్ట్ జారీ

- నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ
- నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు
- రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- సహాయక చర్యల్లోని సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి 2లో



## తారుమారైన సీన్..

### రష్యాకే పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్

- ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలో తీవ్రమైన పెట్రోల్ కొరత
- రష్యాకు భారీగా పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్
- గత రెండు నెలల్లో సుమారు 10 లక్షల బ్యారెళ్ల సరఫరా
- ఇరాన్ యుద్ధంతో రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు పెంచుకున్న భారత్
- దిగుమతులు తగ్గినా భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారు 2లో

## ఉజ్బెకిస్థాన్‌లో యోగా సెషన్..

### ఆసక్తిగా వీక్షించిన ప్రధాని మోదీ



- రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీ
- తాష్కెంట్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొని సాధకులను అభినందించారు
- అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయేవ్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు
- పర్యటన అనంతరం కిర్గిస్థాన్‌లో జరిగే ఎస్‌సీఓ సదస్సులో పాల్గొననున్న ప్రధాని 2లో

ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం చేసిన ఉజ్బెకిస్థాన్ 2లో



## దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ 2026 పరీక్ష..

### జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ

- మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు
- జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష
- సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ
- భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్ 2లో

## ప్రపంచానికే ప్రళయం వచ్చినా..

# ఈ దేశం తట్టుకుని నిలబడుతుంది!

- ప్రపంచ విపత్తులను తట్టుకునే దేశాల్లో ఆస్ట్రేలియా నంబర్ వన్
- గ్లోబల్ ఛాలెంజెస్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనంలో వెల్లడి
- ద్వీప దేశం కావడం, ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి ప్రధాన బలాలు
- న్యూజిలాండ్, జపాన్, స్విట్జర్లాండ్, అర్జెంటీనాలు తర్వాతి స్థానాల్లో
- ఏ దేశానికీ పూర్తిస్థాయి భద్రత లేదని స్పష్టం చేసిన పరిశోధకులు



ప్రపంచవ్యాప్తంగా పెను విపత్తు సంభవించి, మానవ నాగరికతకే ముప్పు వాటిల్లితే ఏ దేశం తట్టుకోగలదు? ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు జర్మనీలోని హేగన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఒక విస్తృత అధ్యయనం చేపట్టారు. 'గ్లోబల్ ఛాలెంజెస్' అనే ప్రముఖ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం, అలాంటి తీవ్రమైన విపత్తులను ఎదుర్కొని నిలబడగల అత్యంత స్థితిస్థాపకత కలిగిన దేశం ఆస్ట్రేలియా అని తేలింది. పరిశోధకులు ప్రపంచ విపత్తులను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించి విశ్లేషించారు. మొదటిది, భారీ అగ్నిపర్వతాల విస్ఫోటనం, గ్రహశకలాల దాడి లేదా అణు యుద్ధం వంటి వాటి తరువాయి 2లో

# తారుమారైన సీన్.. రష్యాకే పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్

అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ముడి చమురు కోసం రష్యాపై ఆధారపడే భారత్, ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) తీవ్రంగా దెబ్బతినడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఏర్పడిన తీవ్రమైన ఇంధన కొరతను అధిగమించేందుకు రష్యా, భారత్ నుంచి పెట్రోల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వోర్టెక్సా నివేదిక ప్రకారం.. గత రెండు నెలల్లో (జులై ఆగస్టు) రష్యా రిఫైనరీలపై సుమారు 32 సార్లు డ్రోన్ దాడులు జరిగాయి. దీనివల్ల దేశీయంగా పెట్రోల్ ఉత్పత్తి ఏకంగా 70% పడిపోయింది. ఫలితంగా రష్యాలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రష్యా ప్రభుత్వం తన దేశం నుంచి పెట్రోల్, డీజిల్ ఎగుమతులను నిషేధించింది. ఈ నేపథ్యంలో భారత్ గత రెండు నెలల్లో దాదాపు 10 లక్షల బ్యారెల్ల పెట్రోల్‌ను రష్యాకు సరఫరా చేసింది. భారత్‌తో పాటు తుర్కియే, మొరాకో కూడా రష్యాకు ఇంధనాన్ని అందిస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్‌లో ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచే ఈ ఎగుమతుల్లో ఎక్కువ భాగం జరిగినట్లు వాణిజ్య వర్గాలు తెలిపాయి. ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రాస్‌నెఫ్ట్‌కు వాటా ఉండటం గమనార్హం. మరోవైపు, ప్రపంచంలో మూడో అతిపెద్ద రిఫైనర్‌గా ఉన్న భారత్ తన సామర్థ్యాన్ని 272 ఎంఎంటీపీఏ నుంచి 300 ఎంఎంటీపీఏకు పెంచుకోవడం ద్వారా గ్లోబల్ రిఫైనింగ్ హబ్‌గా తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇటీవల పేర్కొన్నారు. అదే సమయంలో ఇరాన్ యుద్ధం, హర్మూజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాల నేపథ్యంలో భారత్ తన ముడి చమురు దిగుమతులను కూడా విస్తృతం చేసుకుంది. ఒకప్పుడు 27 దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకున్న భారత్, ఇప్పుడు 41 దేశాల నుంచి కొనుగోలు చేస్తోంది. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా నిలిచిపోవడంతో, రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతులు రికార్డు స్థాయికి చేరాయి. అయితే, కెప్లర్ డేటా ప్రకారం ఆగస్టులో దిగుమతులు కాస్త తగ్గి 2.1 మిలియన్ బ్యారెళ్లకు చేరాయి. అయినప్పటికీ, దేశ మొత్తం దిగుమతుల్లో 40% వాటాతో భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా రష్యానే కొనసాగుతోంది.

## వెలిగొండ సొరంగంలో
## కృష్ణా జలాల ప్రవాహం చరిత్రాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

ష్కృతమైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన సంతోషాన్ని పంచుకుంటూ కీలక వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఈ ప్రాజెక్టు ఫేజ్ 1ను జాతికి అంకితం చేసి, 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌లోకి విడుదల చేస్తారని లోకేశ్ తెలిపారు. సరిగ్గా 30 ఏళ్ల క్రితం ఈ పరివర్తనాత్మక ప్రాజెక్టుకు చంద్రబాబే శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సొరంగం నుంచి తొలిసారిగా నీరు బయటకు వస్తుండటాన్ని చూడటం చాలా భావోద్వేగంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

"ఇది కేవలం ఒక ఇంజనీరింగ్ అద్భుతం మాత్రమే కాదు. మన రైతులకు, కుటుంబాలకు, మొత్తం వెనుకబడిన ప్రాంతానికి ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న జీవనాడి" అని లోకేశ్ పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్ 1 ద్వారానే 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని, దాదాపు 4 లక్షల మంది ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయని వివరించారు. 'వెలిగొండ జలసిరులు' నిజంగా ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడుగుతాయని ఆయన అభివర్ణించారు. దశాబ్దాల తరబడి కరవుతో అల్లాడిన ప్రకాశం జిల్లా వాసుల కళ్లలో ఈ ప్రాజెక్టు ఆనందం నింపుతుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) మాజీ జనరల్ జావో జోంగ్కీపై చైనా ప్రభుత్వం వేటు వేసింది. దేశంలోని అత్యున్నత రాజకీయ సలహా మండలి సభ్యత్వంతోపాటు ఆయన నిర్వహిస్తున్న ఇతర కీలక రాజకీయ పదవుల నుంచి జీవోను తొలగించింది. 2017లో జరిగిన డోక్లాం ప్రతిష్టంభన, 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల సమయంలో జావో జోంగ్కీ పీఎల్‌ఏ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు అధిపతిగా వ్యవహరించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (CPPCC) స్టాండింగ్ కమిటీ ఆగస్టు 26న సమావేశమై జావోను పదవుల నుంచి తొలగించాలని ఓటింగ్ ద్వారా నిర్ణయించింది. జాతీయ కమిటీ సభ్యత్వంతో పాటు, జాతి, మతపరమైన వ్యవహారాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ పదవి నుంచి కూడా ఆయన్ను తప్పించారు. అయితే, ఈ నిర్ణయానికి గల కారణాలను చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఆయనపై ఎటువంటి విచారణకు ఆదేశించినట్లు కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం గమనార్హం. భారత్‌తో సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించే వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు 2016లో తొలి కమాండర్‌గా జావో నియమితులయ్యారు. ఆయన పదవీకాలంలోనే 2017లో 73 రోజుల పాటు డోక్లాం ప్రతిష్టంభన కొనసాగింది. అలాగే 2020లో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందిన గల్వాన్ ఘర్షణలు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సైన్యంలో చేపట్టిన భారీ ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో జనరల్ జాంగ్ యోక్సియా, లియు జెన్లీలను కూడా సెంట్రల్ మిలిటరీ కమిషన్ నుంచి తొలగించారు. సైన్యంపై తన పట్టును మరింత బిగించుకునే క్రమంలోనే జిన్‌పింగ్ వరుసగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# జెండాను కాలితో తన్నుతూ ఖలిస్థానీల కండకావరం.. కేంద్రమంత్రి వార్నింగ్

అమెరికాలో ఖలిస్థానీ మద్దతుదారులు మరోసారి రెచ్చిపోయారు. భారత జాతీయ పతాకాన్ని దారుణంగా అవమానించారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వారికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. దేశాన్ని, జాతీయ జెండాను అవమానిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే, న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ పాల్గొన్న ఓ కార్యక్రమం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడికి చేరుకున్న కొందరు ఖలిస్థానీ సానుభూతిపరులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వారు భారత జాతీయ జెండాను కిందపడేసి, కాళ్లతో తొక్కారు. అంతటితో ఆగకుండా జెండాను చించివేస్తూ దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా స్పందించారు. ఖలిస్థానీలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "మీకు ఆర్ఎస్ఎస్‌ను, బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే స్వేచ్ఛ ఉంది. కానీ మన దేశాన్ని అవమానించవద్దు. జాతీయ జెండాను అగౌరవపరచవద్దు. అది మీకు చాలా ప్రమాదకరం" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. విదేశీ గడ్డపై భారత జాతీయ పతాకానికి జరిగిన ఈ అవమానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దేశ గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కేంద్రం ఈ హెచ్చరిక ద్వారా తేల్చిచెప్పినట్టయింది.

## దేశవ్యాప్తంగా
## ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష

దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (NBEMS) ప్రకటించింది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది. పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అప్రైజర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్‌టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది. పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

# నేపాల్‌లో మరో జల ప్రళయం మరో హై అలర్ట్ జారీ

ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది. "భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్టు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్ఆర్ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది. కొద్దిసేపటికే ఎన్‌డీఆర్ఆర్ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

## మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..
## వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం చేసిన ఉజ్బెకిస్థాన్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన 30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

## ఉజ్బెకిస్థాన్‌లో యోగా సెషన్..
## ఆసక్తిగా వీక్షించిన ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రెండు రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో భాగంగా ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన ప్రత్యేక యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉజ్బెకిస్థాన్ యోగా ఫెడరేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 52 మంది యోగా సాధకులు ప్రదర్శించిన ఆసనాలను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమ ప్రాంగణంలో కలియదిరుగుతూ సాధకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఈ రోజు మీరు అద్భుతమైన యోగాను ప్రదర్శించారు. ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్న నా మిత్రుడు, దేశాధ్యక్షుడికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాధకులతో కలిసి ఆయన గ్రూప్ ఫోటో దిగారు. ఈ యోగా సెషన్‌కు సంబంధించిన వీడియోను కూడా ప్రధాని పంచుకున్నారు. అంతకుముందు శనివారం తాష్కెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయేవ్ ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి అధ్యక్ష భవనం వరకు ఇరువురు నేతలు కలిసి ప్రయాణించడం వారి మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను తెలియజేసింది. అనంతరం ఇద్దరి మధ్య విందు సమావేశం జరిగింది. ఆదివారం ఇరువురు నేతలు ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు.

# ప్రపంచానికే ప్రళయం వచ్చినా.. ఈ దేశం తట్టుకుని నిలబడుతుంది!

(మొదటిపేజీ తరువాయి)

వల్ల సూర్యరశ్మి భూమికి చేరకపోవడం. రెండోది, భయంకరమైన సైబర్ దాడులు, మహమ్మారులు లేదా భూ అయస్కాంత తుపానుల వల్ల విద్యుత్, రవాణా, ఆహార వ్యవస్థలు కుప్పకూలడం. మూడోది, ఖండాలను నాశనం చేసే స్థాయిలో ప్రాణనష్టం కలిగించే జీవసంబంధమైన ముప్పులు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కీలకమైన వ్యవస్థలను కాపాడుకుంటూ మానవ మనుగడను కొనసాగించగల సామర్థ్యం ఆస్ట్రేలియాకే ఎక్కువగా ఉందని ఈ అధ్యయనం పేర్కొంది.

**ఆస్ట్రేలియాకే ఎందుకంత శక్తి?**

ఆస్ట్రేలియా పలు కారణాల వల్ల ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఇది ఒక ద్వీప ఖండం కావడం వల్ల విపత్తు సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలను సులభంగా తెంచుకుని, తనను తాను కాపాడుకోగలదు. ఆహార ఉత్పత్తిలో దాదాపు స్వయం సమృద్ధి, బలమైన పారిశ్రామిక, మైనింగ్ రంగం, ఆర్థిక స్థిరత్వం, సుస్థిరమైన ప్రజాస్వామ్య పాలన వంటివి ఆ దేశానికి ప్రధాన బలాలుగా ఉన్నాయి. "భూమిపై అత్యంత స్థితిస్థాపకత కలిగిన ప్రదేశం ఆస్ట్రేలియా. అది ఒక ద్వీపం కావడం వల్ల తనను తాను వేరుచేసుకోగలదు. విపత్తుల్లో చిక్కుకునే ఇతర దేశాల ప్రభావం దీనిపై పడదు. ఆస్ట్రేలియాతో సరిహద్దులు పంచుకునే దేశాలేవీ లేవు. అక్కడ ఆహార ఉత్పత్తి చాలా ఎక్కువ, దేశీయంగా బలమైన పరిశ్రమలున్నాయి" అని ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ఫ్లోరియన్ ఉల్రిచ్ జెన్ వివరించారు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా తర్వాత న్యూజిలాండ్, జపాన్, స్విట్జర్లాండ్, అర్జెంటీనా దేశాలు నిలిచాయి. అయితే, స్విట్జర్లాండ్ మినహా మిగతా దేశాలకు సునామీలు, స్థానిక అగ్నిపర్వతాల నుంచి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు తెలిపారు. అయితే, ఏ దేశానికీ సంపూర్ణ భద్రత లేదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఇంధనం, మందులు, ఎరువుల వంటి కొన్ని అత్యవసరాల కోసం ఆస్ట్రేలియా కూడా అంతర్జాతీయ వాణిజ్యంపైనే ఆధారపడి ఉంది. ఈ అధ్యయనం కేవలం ఇతర దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియాకు ఉన్న సాపేక్ష భద్రతను మాత్రమే సూచిస్తుందని, నిజమైన ప్రపంచ విపత్తు సంభవిస్తే దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుందని పరిశోధకులు తేల్చిచెప్పారు.

# వెన్నెలంటి వెన్నపూస... కమ్మని కబుర్లు!

**వెన్నపూస'... ఆ పేరును తలవగానే- దాని వెన్నెల రంగూ, సుతిమెత్తటి రూపం, చల్లటి అనుభూతి, మాటలకందని మాధుర్యం... మనసులో మెదలుతాయి. అందుకే, కల్లాకపటం లేని మనసునీ, మృదువైన మాటల్నీ వెన్నతోనే పోలుస్తాం. స్వచ్ఛమైన ఆ సుగుణాలకు మురిసిపోయే, చిన్నికృష్ణుడూ వెన్న దొంగ అయ్యాడట. కమ్మదనానికి మారుపేరుగానూ చెప్పే వెన్నపూసలో రుచీ, ఘుమఘుమలతోపాటు, ఆరోగ్యప్రయోజనాలూ ఎన్నో ఉన్నాయి. ఈ కృష్ణాష్టమికి కన్నయ్యకు నైవేద్యంగా పెడుతూనే, ఆసక్తికరమైన వెన్న కబుర్లన్నీ చదివేద్దామా!**



మురుకులూ, చెక్కలూ మొదలు మిఠాయిల వరకూ కాస్తంత వెన్నపూస కలపకపోతే వాటికి కమ్మదనమే రాదంటూ అప్పట్లో పిండివంటల్లో తప్పకుండా వెన్న వేసేవాళ్లు. 'అబ్బ, వెన్నంటే నాకెంత ఇష్టమో!' అంటూ దాని మాధుర్యాన్ని వర్ణిస్తూనే, అమ్మమ్మ మజ్జిగ చిలుకుతున్నప్పుడు పక్కన కూర్చుని వెన్న ముద్దల్ని తిన్న చిన్ననాటి జ్ఞాపకాల్నీ గుర్తు చేసుకుంటారు చాలామంది. కానీ ఇప్పుడు కాలం మారింది. పాలూ, పెరుగూలాగే వెన్ననూ ఇష్టంగా తినే అలవాటు పోయింది. వెన్న తింటే ఆరోగ్యానికి అంతమంచిది కాదన్న భావన పెరిగింది. ఇప్పుడు కేవలం కేకులూ, కుకీలూ, బ్రెడ్ లాంటి బేకరీ పదార్థాల్లో... రోటీ, పాస్తా, మష్రూమ్, చికెన్ తదితర వంటకాల్లో రుచిని పెంచడానికే వేస్తున్నారు. కానీ కాస్త వెన్న తినడం వల్ల ఎంతో లాభం అంటున్నారు వైద్యులు.

**పురాణాల్లో వెన్న...**

రేపల్లెలో ముద్దుల కృష్ణయ్య వెన్న ముద్దల్ని దొంగిలించే పురాణకథలు వింటూనే ఉన్నాం. గొల్లభామల కళ్లు కప్పి, స్నేహితులతో కలిసి ఉట్టి మీదున్న కుండల్ని దింపి, వెన్ననంతా అందరికీ పంచే బాలకృష్ణుడి అల్లరి చేష్టల వెనక అద్భుతమైన ఆధ్యాత్మిక, సామాజిక కోణాలూ ఉన్నాయట. వెన్నను తోటి స్నేహితులకూ, వానరాలకూ పంచడం ద్వారా సమస్త జీవుల పట్లా ప్రేమను చూపించాడు. అంతేకాదు, స్వచ్ఛమైన వెన్నను నిర్మలమైన భక్తికి నిదర్శనంగానూ చెబుతారు. అందుకే, దేవాలయాల్లో వెన్నతో నైవేద్యాల్నీ సమర్పిస్తుంటారు.

**సరికొత్త రుచుల్లో...**

ఆవు, గేదె, మేక పాల నుంచి వెన్నను తీస్తారు. మిగతా వాటితో పోల్చితే ఆవు పాల వెన్న పసుపు రంగులో కనిపిస్తుంది. రిఫ్రిజరేటర్లు లేని రోజుల్లో వెన్న నిల్వ ఉండటానికి ఉప్పు కలిపేవారు. అందుకే ఇప్పుడు మార్కెట్లో సాల్టెడ్ బటర్ కూడా దొరుకుతుంది. ఇంకా మరింత రుచిని ఇవ్వడానికి తాజా క్రీమ్‌తో స్వీట్ బటర్‌నీ తయారుచేస్తున్నారు. ఇవి కాకుండా యూరోపియన్ బటర్ కూడా ఉంటుంది. ఎక్కువసేపు చిలకడం ద్వారా అధిక శాతం కొవ్వుతో వస్తుంది ఇది. ఇంకా బ్రెడ్ మీద రాసుకోవడానికి రకరకాల పదార్థాల్ని కలిపి ప్రత్యేకమైన పద్ధతిలో కాంపౌండ్ బటర్లనీ తీసుకొచ్చారు మాస్టర్ షెఫ్‌లు. వెల్లుల్లి, దాల్చినచెక్క లాంటి మసాలాలు మొదలు మామిడి, స్ట్రాబెర్రీ వంటి పండ్ల వరకూ రకరకాల పదార్థాల్ని కలిపి ఫ్లేవర్డ్ బటర్ వెరైటీలెన్నో వస్తున్నాయి. అవసరానికి తగ్గట్టు వాడుకునేలా వెన్న వాసనల బటర్ డ్రాప్స్, వంటల్లో వేయడానికి వెన్న పొడి, బటర్ స్టిక్స్ లాంటి ఉత్పత్తులూ చాలానే దొరుకుతున్నాయి.

**ఎంత తినాలి?**

సాధారణంగా మన శరీరానికి రోజుకు 20 నుంచి 35 గ్రాముల కొవ్వు అవసరం. కాబట్టి రోజుకి 5 నుంచి 10 గ్రాముల స్వచ్ఛమైన వెన్న తినొచ్చు. ఆరోగ్యంగా ఉన్నవాళ్లు రెండు టీస్పూన్ల వెన్నను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. అయితే మోతాదు మించితే ఇందులోని సంతృప్త కొవ్వులు గుండె జబ్బులకు కారణం కావొచ్చు. అందుకే, హార్ట్‌పేషెంట్స్ వెన్నకు దూరంగా ఉండటమే మంచిది.

**కాస్త జాగ్రత్త...**

బయట రకరకాల బటర్ ప్యాకెట్లలో వెజిటబుల్ నూనెల్ని కలిపి కల్తీ చేస్తున్నారు. మార్కెట్లో దొరికే వెన్న కొనడం కన్నా ఇంట్లో తయారుచేసుకున్న తెల్లటి వెన్నపూసని వాడటమే ఆరోగ్యం అంటారు పోషకాహార నిపుణురాలు సుజాతా స్టీఫెన్.

**అసలేంటీ వెన్న...**

పాలు కాచి, తోడు పెట్టి పెరుగు మీద మీగడను బాగా చిలికితే పైన వచ్చేదే వెన్న. క్రీమీ క్రీమీగా కమ్మటి సువాసనలతో ఉంటుంది. వెన్న ప్రపంచంలోని అతి పురాతన పాల పదార్థాల్లో ఒకటి. ప్రాచీన ఈజిప్షియన్లూ, గ్రీకులూ వెన్నను కేవలం తినడానికే కాకుండా చర్మవ్యాధులకూ, కంటి ఇన్‌ఫెక్షన్లకూ, కాలిన గాయాలకు మందుగానూ రాసేవారు. రోమన్లు జుట్టు నిగారింపు కోసం వెన్నను తలకు రాసుకునేవాళ్లు, చర్మానికి మాయిశ్చరైజర్‌గా వాడేవారు. ఇంకా దీన్ని దీపాల్ని వెలిగించడానికీ ఉపయోగించేవాళ్లట. అలా 19వ శతాబ్దం నుంచీ దీని వాడకం బాగా పెరిగింది. క్రీమ్ సెపరేటర్ మెషీన్లతో ఎక్కువ మొత్తంలో వెన్నను తయారు చేయడం మొదలుపెట్టడంతో వాణిజ్యపరంగా వెన్న అమ్మకాలు ఎక్కువయ్యాయి.

**ఎన్ని ప్రయోజనాలో...**

వెన్న, నెయ్యి దాదాపు ఒకటే కదా. వెన్నను వేడి చేస్తేనే కదా నెయ్యి వచ్చేది అనుకుంటాం కానీ, వెన్న సహజమైన పదార్థం కాబట్టి దీంట్లో మిల్క్ ప్రొటీన్లూ, లాక్టోజ్, నీళ్లూ ఉంటాయి. నెయ్యిలో అవేమీ ఉండవు. ఇంకా నెయ్యితో పోల్చితే క్యాలరీలూ, కొవ్వులూ తక్కువ మొత్తంలో ఉంటాయి వెన్నలో. వెన్నలో మన శరీరానికి అవసరమైన విటమిన్లు ఉంటాయి. దీంట్లోని ఎవిటమిన్ కంటిచూపును మెరుగుపరచడానికీ, చర్మ ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. ఒక చెంచా వెన్న నుంచి శరీరానికి కావాల్సిన ఎవిటమిన్‌లో దాదాపు 11 శాతం దొరుకుతుంది. పిల్లలకు తరచూ వెన్న ఇవ్వడం వల్ల కంటి సమస్యలు దూరం అవుతాయి.

> దీంట్లో శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే ఇవిటమిన్ కూడా తగినంత మోతాదులో ఉంటుంది. ఇది శరీరంలోని కణాలను దెబ్బ తినకుండా కాపాడుతుంది.
> ఇందులో క్యాల్షియం, సెలీనియం, మెగ్నీషియం, పొటాషియం... తదితర ఖనిజాలూ ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లను దరిచేరనివ్వవు.
> వెన్నలో ఎముకల ఆరోగ్యానికి అవసరమైన కె2విటమిన్ కూడా ఉంటుంది. మనం ఆహారం ద్వారా తీసుకునే క్యాల్షియంను ఎముకలూ, దంతాలకు సరిగ్గా చేర్చడంలోనూ, రక్తనాళాల్లో క్యాల్షియం పేరుకుపోకుండా చూడటంలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది.
> వెన్నపూసలోని బ్యుటిరేట్ అనే ఆమ్లం జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది.
> వెన్నలో కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల ఏ కాస్త తీసుకున్నా తక్షణ శక్తి వస్తుంది.
> వెన్నపూసలో ఉండే మంచి కొవ్వు, కొలెస్ట్రాల్ మెదడు కణాల నిర్మాణానికీ, నరాల పనితీరుకూ అవసరమైన శక్తిని అందిస్తాయి. ఇంకా ఇది జ్ఞాపకశక్తినీ, ఏకాగ్రతనీ పెంపొందించడానికి తోడ్పడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలోనూ బాగా పనిచేస్తుంది.
> హార్మోన్ల అసమతుల్యత తగ్గడానికీ, సంతానోత్పత్తికీ వెన్న ఎంతో సాయపడుతుంది.
> వెన్నలోని కాంజుగేటెడ్ లినోలిక్ యాసిడ్ శరీరంలోని అదనపు కొవ్వుల్ని కరిగించడానికి ఉపయోగపడుతుందని పరిశోధనల్లో బయటపడింది.
> కీళ్ల వ్యాధులతో ఇబ్బంది పడే వాళ్లు వెన్నను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. కీళ్ల నొప్పుల్ని తగ్గిస్తుంది ఇది.
> ప్రపంచవ్యాప్తంగా వెన్నను ఎక్కువ ఉత్పత్తి చేయడంలోనే కాదు, వినియోగించడంలో కూడా ముందు ఉన్నది మనదేశమే. కానీ అత్యధికంగా వెన్నను ఎగుమతి చేసే దేశం మాత్రం న్యూజిలాండ్. ఏటా దాదాపు 4,75,000 టన్నుల బటర్‌ని విదేశాలకు ఎగుమతి చేస్తుంది ఇది.



## చరిత్రలో ఈ రోజు
### ఆగస్టు 31

AUG 31

* 1864 : హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జననం (మ.1945).(చిత్రంలో)
* 1925 : సినీగీత రచయిత, సాహితీకారుడు ఆరుద్ర జననం (మ.1988).
* 1932 : తెలుగు కథా రచయిత. రావిపల్లి నారాయణరావు జననం.
* 1934 : తెలుగు సినిమా రచయిత రాజశ్రీ జననం (మ.1994).
* 1969 : మాజీ భారత క్రికెట్ క్రీడాకారుడు జవగళ్ శ్రీనాథ్ జననం.
* 1907 : ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రామన్ మెగసెసే జననం (మ.1957).



ఆదిభట్ల నారాయణదాసు

* 1997 : బ్రిటన్ యువరాజు ప్రిన్స్ చార్లెస్ మాజీ భార్య ప్రిన్సెస్ డయానా దుర్మరణం (జ.1961).
* 2014 : భారతీయ చిత్రకారుడు బాపు మరణం (జ.1933).
* 2020 : భారతదేశ 13వ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణం. (జ.1935)



## గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం
## కుమార్తె వివాహానికి హాజరైన చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ పార్టీ నేతల ఇళ్లలోని శుభకార్యాలకు హాజరయ్యారు. ఆదివారం ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళ్తే, అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య, అనంతపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడి కుమారుడు శివరాజుల వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. అనంతపురం పట్టణంలోని ఎమ్‌వైఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా హాజరయ్యారు. వేదికపైకి వెళ్లి నూతన దంపతులు శివరాజువిద్యలను మనసారా ఆశీర్వదించి, వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ముఖ్యమంత్రి రాకతో



వివాహ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం, తన పర్యటనలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి వెళ్లిన చంద్రబాబు, అక్కడ కూడా మరో వివాహ వేడుకలో పాలుపంచుకున్నారు. స్వర్గీయ పీఆర్ మోహన్ ఇందిర దంపతుల కుమార్తె డింపుల్, రాజేష్‌ల వివాహానికి హాజరై నూతన జంటను ఆశీర్వదించారు.

## 35వ రోజుకు చేరిన 'ఇంటింటికీ టీడీపీ'..
## 94 లక్షల ఇళ్లకు చేరిన ప్రచారం

- **35వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం**
- **ఇప్పటివరకు 94.22 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు**
- **కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరిస్తున్న నేతలు**
- **ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరిస్తున్న కార్యకర్తలు**
- **కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీడీపీ వెల్లడి**

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఆదివారంతో ఈ కార్యక్రమం 35వ రోజు పూర్తి చేసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 94.22 లక్షల ఇళ్లను సందర్శించినట్లు టీడీపీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆదివారం ఒక్కరోజే టీడీపీ నాయకులు, కార్యకర్తలు 1,78,567 కుటుంబాలను నేరుగా కలిశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి,




సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ప్రతి గడపకు వెళ్లి రైతులకు, మహిళలకు, యువతకు, పేద, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి నుంచి సూచనలు, అభిప్రాయాలను సేకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి తమ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, వారి భాగస్వామ్యంతో ఇది మరింత విస్తృతంగా సాగుతోందని టీడీపీ తెలిపింది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని ఆ ప్రకటనలో పేర్కొంది.

# వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం.. హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు

- సంతృప్తికరంగా ముగిసిన వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్
- కొల్లం వాగు వద్ద గేట్లు ఎత్తి సొరంగంలోకి కృష్ణా జలాల విడుదల
- రేపు ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సీఎం చంద్రబాబు
- ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల కరవు ప్రాంతాలకు తీరనున్న నీటి కష్టాలు

ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు, సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు.











ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.












## పవన్ పుట్టిన రోజున..
# జనసేన యువజన విభాగం ఆవిష్కరణ

అమరావతి: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 2న జనసేన యువజన విభాగాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆ పార్టీ తెలిపింది. పిఠాపురంలో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య



అతిథిగా పాల్గొననున్నారు. యువజన విభాగం, లోగో, గీతాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ కేరళలో చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఆయన ఆన్‌లైన్ ద్వారా పార్టీ శ్రేణులకు సందేశం ఇవ్వనున్నట్లు పార్టీ తెలిపింది. యువజన విభాగం ఏర్పాటు ఉద్దేశం, లక్ష్యాలు, యువతలో రాజకీయ చైతన్యం తదితర అంశాలపై పవన్ దిశానిర్దేశం చేయనున్నారు. యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జనసేన తెలిపింది.

## అదే పెద్దపులి మళ్లీ వచ్చింది..
# పోలవరం ప్రాజెక్టు వద్ద భయాందోళనలో ప్రజలు

- పోలవరం ప్రాజెక్టు సమీపంలో పులి సంచారం కలకలం
- రెండు దూడలపై దాడి చేసి చంపడంతో తీవ్ర భయాందోళన
- గతంలో పట్టుకుని పాపికొండల్లో వదిలిన పులేనని నిర్ధారణ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ హెచ్చరిక
- పులిని బంధించేందుకు రంగంలోకి ప్రత్యేక నిపుణుల బృందాలు

ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సమీపంలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాజెక్టు పరిధిలోని దేవరగొంది జంట టన్నెళ్ల వద్ద పులి తిరుగుతుండటంతో స్థానిక గ్రామ ప్రజలు, ప్రాజెక్టు సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. రెండు దూడలను చంపేయడంతో ఈ భయం మరింత పెరిగింది. అటవీ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి పులిని బంధించేందుకు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, శనివారం రాత్రి పోలవరం ప్రాజెక్టు పాత దేవరగుండి టన్నెల్ వద్ద ఉన్న రెగ్యులేటర్ సమీపంలో స్థానికులు పులిని గమనించారు. అక్కడే ఉన్న రెండు దూడలపై అది దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఆదివారం ఉదయం ముంపు గ్రామమైన దేవరగొండిలోని జంట టన్నెళ్ల వద్ద కూడా పులి కదలికలను అధికారులు గుర్తించారు.



దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ప్రాజెక్టు ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు, స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

* **గతంలో పట్టుబడి, మళ్లీ ప్రత్యక్షం**

ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోకి ప్రవేశించిన ఈ పులి, అప్పట్లో బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోనూ సంచరించి కలకలం రేపింది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లా అడవుల్లోకి వెళ్లింది. రాయవరం సమీపంలో దీని సంచారం ఎక్కువ కావడంతో, పుణే నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఫిబ్రవరిలో దీనిని సురక్షితంగా పట్టుకుంది. అనంతరం పులిని విశాఖపట్నం జూకు తరలించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆధునిక కాలర్ ఐడీని అమర్చారు. పోలవరం ప్రాంతంలోని పాపికొండల అభయారణ్యంలో దానిని తిరిగి వదిలిపెట్టారు. అయితే, అది అభయారణ్యానికే పరిమితం కాలేదు. ఏప్రిల్ 14న గోదావరి నదిని దాటి కొట్టూరు ముంపు గ్రామంలోకి ప్రవేశించి, అప్పటి నుంచి ఏలూరు, పోలవరం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది.

# కొండలను తొలిచి కరవు ప్రాంతాల్లో నీరు పారించిన ఘనత చంద్రబాబుదే: గొట్టిపాటి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చరిత్ర సృష్టించాలన్నా.. ఆ చరిత్రను తిరగరాయాలన్నా సీఎం చంద్రబాబుకే సాధ్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వెనుకబడిన మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు హార్టికల్చర్ హబ్‌లో చేర్చడం, వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం సీఎం నాయకత్వంలోనే సాధ్యమైందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, నేతలంతా ఢిల్లీకి వెళ్లి వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలు సాధించామని గుర్తుచేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్వహణను పట్టించుకోలేదని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు పేరు ఎత్తే అర్హత వైకాపా నేతలకు లేదన్నారు. సోమవారం మార్కాపురం జిల్లాలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కాబోతోందని.. 30 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు



ఎదురుచూస్తున్న కల నెరవేరబోతోందని చెప్పారు. కొండలను తొలిచి కరవు ప్రాంతాల్లో నీరు పారించిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. వెలిగొండ నిర్వాసితులకు కేవలం 48 రోజుల్లో రూ.768 కోట్ల పరిహారం అందించడం రికార్డని తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభంతో మార్కాపురం ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

# గుండె జబ్బుల నిర్ధారణలో ఏఐ, కార్డియాక్ సీటీ పాత్ర కీలకం

విశాఖపట్నం (వన్‌టౌన్): గుండె జబ్బుల నిర్ధరణ, ప్రమాద అంచనా, చికిత్స ప్రణాళికలో కృత్రిమ మేధ (ఏఐ), ఆధునిక కార్డియాక్ సీటీ సాంకేతికత కీలక మార్పులకు దారి తీస్తున్నాయని ఆస్టర్ రమేశ్ ఆసుపత్రుల చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేశ్‌బాబు అన్నారు. విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాల అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం ఆస్టర్ రమేశ్ ఆసుపత్రి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖ చాప్టర్ సంయుక్తంగా ఏఐ కార్డియాలజీట్రాన్స్‌ఫరింగ్ రియాక్టివ్ టూ ప్రివెంటివ్ థెరపీ అనే అంశంపై నిర్వహించిన నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమంలో నెక్స్ ఎరా ఆఫ్ కార్డియాక్ సీటీ ఎఫ్ఎఫ్ఆర్ అండ్ ప్లాక్ మార్ఫాలజీ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 'గతంలో కార్డియాక్ సీటీని ప్రధానంగా కరోనరీ ధమనుల్లో బ్లాకేజీని గుర్తించే పరీక్షగా మాత్రమే పరిగణించేవారు. ఆధునిక సాంకేతికత అభివృద్ధితో ఇప్పుడు కార్డియాక్ సీటీ గుండె ధమనుల వ్యాధిని మరింత లోతుగా




అర్థం చేసుకునే శక్తిమంతమైన సాధనంగా మారుతోంది. బ్లాకేజీ ఎంత శాతం ఉంది? అనే ప్రశ్నతో గుండెకు రక్త ప్రవాహంపై ఎంత ప్రభావం ఉంది అనేది తెలుసుకోవడం చికిత్స నిర్ణయాల్లో ఎంతో ముఖ్యం. సీటీఎఫ్ఎఫ్ఆర్ వంటి సాంకేతికతలు సీటీ చిత్రాల ఆధారంగా రక్త ప్రవాహంపై బ్లాకేజీ చూపించే ప్రభావాన్ని అంచనా వేయడానికి సాయపడుతుంది. ఆధునిక ఇమేజింగ్, ఏఐ ఆధారిత విశ్లేషణలు ముందస్తు ప్రమాద అంచనాకు మరింత ఉపయోగకరంగా మారుతున్నాయి. కార్డియాక్ సీటీ భవిష్యత్తులో రోగ నిర్ధరణకే పరిమితం కాకుండా చికిత్స ప్రణాళికలోనూ కీలక పాత్ర పోషిస్తుంది' అని రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఆస్టర్ రమేశ్ ఆసుపత్రి సీనియర్ వైద్య నిపుణులు రాజా రమేశ్, అనూప్, రామ్‌మనోహర్, వినయ్ గాంధీ, కొల్లిపర రవికాంత్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు పట్టుదలతోనే
# వెలిగొండ పూర్తి: దేవినేని ఉమ

అమరావతి: సీఎం చంద్రబాబు పట్టుదలతోనే వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయిందని మాజీ మంత్రి, తెదేపా నేత దేవినేని ఉమ అన్నారు. ప్రకాశం, మార్కాపురం ప్రజల గుండెల్లో సీఎం చంద్రబాబు చెరగని ముద్రవేశారని పేర్కొన్నారు. వెలిగొండ ప్రారంభోత్సవం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ మూడు దశాబ్దాల ప్రజల కల అని పేర్కొన్నారు. వెలిగొండకు శంకుస్థాపన చేసింది.. ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబేనని అన్నారు. సోమవారం ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నల్లమలసాగర్‌కు 10.7 టీఎంసీల నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌తో



ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలకు సాగునీరు అందుతుందన్నారు.

# మారికవలస స్కూల్‌పై రాజకీయాలు చేస్తున్నారు: మంత్రి సంధ్యారాణి

విశాఖ: విశాఖ జిల్లా మారికవలస రెసిడెన్షియల్ స్కూల్‌పై కొందరు రాజకీయాలు చేస్తున్నారని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మండిపడ్డారు. గిరిజన విద్యార్థులు చేరకుండా కొందరు గొడ్డలి పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి.. ఐఐటీలు, ఎన్ఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వారికి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు మారికవలసలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పటికే 445 మంది విద్యార్థులు చదువుతున్నారని.. మరింత మంది విద్యార్థులు స్కూల్‌లో చేరకుండా కొందరు రాజకీయ స్వార్థంతో కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గిరిజన బిడ్డలకు ఉన్నత విద్య అవసరం లేదన్నట్లుగా వారి వైఖరి ఉందని ఆక్షేపించారు. గిరిజన సమాజం కోసం ఎలాంటి విమర్శలనైనా భరిస్తానని, ప్రభుత్వాన్ని తిట్టడమే లక్ష్యంగా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.



# హైదరాబాద్‌లో రూ.183 కోట్ల భారీ జీఎస్టీ స్కామ్.. వ్యాపారి ఖాతా హ్యాక్ చేసి దందా!

- **హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ జీఎస్టీ మోసం**
- **వ్యాపార సంస్థ జీఎస్టీ ఖాతా హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు**
- **రూ.183.61 కోట్లకు 730 నకిలీ ఇన్వాయిస్‌ల సృష్టి**
- **అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందేందుకు యత్నం**
- **తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు, దర్యాప్తు**

హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఓ వ్యాపార సంస్థకు చెందిన జీఎస్టీ ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, ఏకంగా రూ.183.61 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ మోసం వెనుక వ్యవస్థీకృత ముఠా హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

**అసలేం జరిగిందంటే..!**

నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన నిఖిల్ రెడ్డి, అనంతరెడ్డి అనే సోదరులు హయత్‌నగర్‌లో 'యుక్తా ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్' పేరుతో వ్యాపారం చేస్తున్నారు. ఆగస్టు 3న ఆ సంస్థ అకౌంటెంట్, జీఎస్టీ పోర్టల్‌లో లాగిన్ అయ్యేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. లాగిన్ వివరాలు



(క్రెడెన్షియల్స్) తప్పుగా ఉన్నాయని సందేశం వచ్చింది. అనుమానంతో పరిశీలించగా, జులై 23వ తేదీనే గుర్తుతెలియని వ్యక్తులు తమ కంపెనీ జీఎస్టీ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీని మార్చేసినట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని యజమానులకు తెలియజేశారు. చార్టర్డ్ అకౌంటెంట్ సలహా మేరకు వారు జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు జోక్యం చేసుకుని ఖాతాలోకి లాగిన్ అయిన తర్వాత అసలు మోసం బయటపడింది. ఖాతాను హ్యాక్ చేసిన దుండగులు, దాని ద్వారా రూ.183.61 కోట్ల విలువైన 730 నకిలీ ఇన్వాయిస్‌లు, ఈవే బిల్లులు సృష్టించినట్లు తేలింది. ధన్‌శ్రీ ఎంటర్‌ప్రైజెస్, ట్రస్ట్ ట్రేడర్స్, హిందుస్థాన్ ట్రేడర్స్ వంటి పలు సంస్థల పేర్లతో ఈ నకిలీ బిల్లులను తయారు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొంది, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడమే ఈ మోసం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది.

**విచారణలో కీలక అంశాలు**

ఈ కేసులో నేరగాళ్లు అనుసరించిన విధానం అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. సాధారణంగా జరిగే మోసాల్లా నకిలీ జీఎస్టీ నంబర్‌ను సృష్టించకుండా, ఇప్పటికే వ్యాపారం చేస్తున్న అసలైన సంస్థ ఖాతానే లక్ష్యంగా చేసుకున్నారు. ఖాతాను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, దాని ద్వారా భారీగా నకిలీ లావాదేవీలు జరిపారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఎవరున్నారు? ఈ ఫేక్ బిల్లుల ద్వారా ఎంత మొత్తం క్లెయిమ్ చేశారు? వాస్తవంగా ప్రభుత్వానికి ఎంత నష్టం వాటిల్లింది? అనే కోణాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఓ వ్యవస్థీకృత సైబర్ ముఠా ప్రమేయం ఉన్నట్లు బలంగా అనుమానిస్తున్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

- **కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్**
- **రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి**
- **సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా**
- **అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత**
- **కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య**

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి



అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

- **ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి**
- **తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం**
- **భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్**
- **సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు**

ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక




అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

- **కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్**
- **రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి**
- **సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా**
- **అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత**
- **కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య**

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి



పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## సెంచరీతో చెలరేగిన డీజీపీ సీవీ ఆనంద్..

హైదరాబాద్: తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సెంచరీ కొట్టారు. స్వతహాగా క్రికెటరైన ఆయన 'సి డివిజన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్'లో అదరగొట్టారు. సికింద్రాబాద్ క్లబ్ మైదానంలో హైదరాబాద్ జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో శతకం (126 నాటౌట్) బాదారు. దీంతో సికింద్రాబాద్ క్లబ్ జట్టు 95 పరుగుల తేడాతో విజయం సాధించింది. సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన సీవీ ఆనంద్.. ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడ్డారు. 82 బంతుల్లో 21 ఫోర్లు, 5 సిక్సర్లు బాదారు. బౌలింగ్‌లోనూ ఆయన రాణించారు. 5 ఓవర్లు వేసి.. ఎనిమిది పరుగులు మాత్రమే ఇచ్చి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఐపీఎస్ కాకముందు క్రికెట్ ప్లేయర్ అయిన డీజీపీ సీవీ ఆనంద్.. చదువుకునే రోజుల్లోనే అండర్22కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఆడుతూ ఐదు సెంచరీలు సాధించారు.



2019లో అఖిల భారత టెన్నిస్ టోర్నీలోనూ ప్రథమ స్థానం సాధించారు. పలు గోల్ఫ్ టోర్నమెంట్లలోనూ పాల్గొన్నారు.



## తెలంగాణలో 42
## రైల్వే స్టేషన్ల అభివృద్ధి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వికారాబాద్: రూ.27 కోట్లతో చేపట్టిన వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో పాటు తెలంగాణలో 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్, 2 లిఫ్టులు, క్యాంటీన్, దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునికీకరణ పనులు పూర్తయిన తర్వాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.

## నీట్ పీజీ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి

**జాతీయ వైద్య పరీక్షల బోర్డు (ఎన్‌బీఈఎంఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్ పీజీ-2026 పరీక్ష ఆదివారం దేశవ్యాప్తంగా జరిగింది. ఒకే షిఫ్ట్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుండగా.. 7 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆ ఫొటోలు మీకోసం..**









# కంటెంట్ క్రియేటర్లు..యూట్యూబర్లకు మోదీ సూచన..!

దిల్లీ: క్షణికమైన ఆనందాన్నిచ్చే మత్తు పదార్థాలు ఉజ్వల భవితను దెబ్బతీసి వ్యక్తిగత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతినబూనాలని యువతకు పిలుపునిచ్చారు. ఎటువంటి మత్తు పదార్థాలకైనా బానిసలు కాకుండా దూరంగా ఉండేలా మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అవగాహన కల్పించాలని కంటెంట్ క్రియేటర్లు, యూట్యూబర్‌లకు సూచించారు. ఆదివారం మన్‌కీ బాత్ 137వ కార్యక్రమంలో మాట్లాడుతూ..ఈ మేరకు యువతకు దిశానిర్దేశం చేశారు. 'మాదక ద్రవ్య రహిత భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి వ్యక్తీ, కుటుంబం, సమాజం, దేశం యావత్తూ కలిసి రావాలని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తులైన వారిని సమాజం అక్కున చేర్చుకుని గౌరవించాలన్నారు. సమాజమద్దతు, యోగ, ధ్యానం, దృఢచిత్తం, ఆత్మవిశ్వాసం ద్వారా మత్తుపదార్థాలకు దూరం కావొచ్చన్నారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో యువత పెద్ద మొత్తంలో హాజరవుతున్నారని పేర్కొన్నారు.

**పీఎం స్వనిధి యోజన..**



వీధి వ్యాపారుల కోసం తీసుకొచ్చిన 'పీఎం స్వనిధి యోజన' లక్షల మంది మహిళలకు ఉపయోగపడుతోందని మోదీ పేర్కొన్నారు. దీనిద్వారా దాదాపు 46శాతం మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటూ.. ఆదాయాన్ని పెంచుకుంటున్న అంశాన్ని గుర్తుచేశారు.

* **మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం**

ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. ఉజ్బెకిస్థాన్ అత్యున్నత 'ఒలియ్ దరాజాలి దస్లిక్' పురస్కారాన్ని అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆయనకు అవార్డు అందజేశారు. ఇది మోదీకి లభించిన 36వ అంతర్జాతీయ పురస్కారం. ఈ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని..దీనిని ఇరుదేశాల మధ్య ఉన్న శాశ్వత బంధానికి అంకితం చేస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. యురేనియం సరఫరా కోసం భారత్ ఉజ్బెకిస్థాన్ దీర్ఘకాలిక ఒప్పందాన్ని చేసుకోనున్నట్లు ప్రకటించారు. మరిన్ని ఒప్పందాలపైనా చర్చలు జరుపుతున్నామన్నారు.

## కానిస్టేబుల్‌కు రూ.7 కోట్ల జాక్‌పాట్



పంజాబ్‌లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌కు లాటరీలో జాక్‌పాట్ తగిలింది. రాఖీ బంపర్ డ్రాలో రూ.7 కోట్ల ప్రైజ్ మనీని గెలుచుకున్నాడు. ఫిరోజ్‌పుర్ జిల్లా మాల్వాల్ కదీమ్ గ్రామానికి చెందిన గుర్‌ప్రీత్ సింగ్ (28).. 2022లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. ప్రస్తుతం 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల పనిమీద నగరానికి వెళ్లిన సందర్భంలో ఉద్ధమ్ సింగ్ చౌక్‌లోని ఓ ఏజెన్సీ నుంచి లాటరీ టికెట్ కొనుగోలు చేశానని, అది ఇంతటి అదృష్టాన్ని తెచ్చిపెడుతుందని అనుకోలేదని గుర్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నాడు. బంపర్ డ్రాలో మొదటి బహుమతి గెలుచుకున్నట్లు తెలియగానే ఆనందంలో మునిగిపోయానని అన్నాడు. లాటరీ విషయం తెలిసిన వెంటనే గుర్‌ప్రీత్ సింగ్ కుటుంబంతోపాటు ఆయన గ్రామంలో సంబరాలు మొదలయ్యాయి. గుర్‌ప్రీత్ సింగ్ తండ్రి రైల్వే శాఖ మాజీ ఉద్యోగి.

## రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారం పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. కిరిషి ప్రాంతంలోని ఒక చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి చేయడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గతంలో ఇదే కర్మాగారాన్ని కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో మాస్కో తిరిగి పునరుద్ధరించింది. మరికొద్ది రోజుల్లో కర్మాగారంలో పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగా ఈ దాడి జరగడం గమనార్హం. రోజుకు 4,00,000 బ్యారెళ్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్ డీజిల్, గ్యాసోలిన్, ఫ్యూయల్ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఉక్రెయిన్



ప్రయోగించిన దాదాపు 494 డ్రోన్లను విజయవంతంగా కూల్చేసినట్లు రష్యా వెల్లడించింది. ఈ నెలలో 20కి పైగా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌కు సరఫరాను కొనసాగించడానికి.. డీజిల్ ఎగుమతులపై నిషేధాన్ని పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దాడులకు ప్రతిస్పందనగా ఉక్రెయిన్ ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. వరుస దాడులు కొనసాగుతుండడంతో రష్యాలో గ్యాసోలిన్ కొరత ఏర్పడింది. మరోవైపు శనివారం తెల్లవారుజామున కీవ్‌పై మాస్కో దాడి చేయడంతో.. పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన గిడ్డంగిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 38మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పేలుడు పరికరాలను గుర్తించి, నిర్వీర్యం చేయడానికి పైరోటెక్నిక్ బృందాలు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు.

## యూరప్‌లోనే ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన భారత మహిళ

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాకు చెందిన 43ఏళ్ల శివానీ మెహ్రోత్రా యూరప్‌లోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఆమె రష్యా (Russia)లోని మౌంట్ ఎల్బ్రస్‌పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. వృత్తిరిత్యా యోగా టీచర్ అయిన శివానీ ఫుల్‌హాఫ్ మారథాన్‌లతో పాటు 50 కిలోమీటర్ల పరుగును కూడా పూర్తి చేసి అల్ట్రా రన్నర్‌గా పేరుపొందారు. ఆగస్టు 8న ఆమె ముంబయి నుంచి దుబాయ్ మీదుగా రష్యా చేరుకున్నారు. అనంతరం స్థానిక ట్రెక్కింగ్ కంపెనీ సహకారంతో ఆగస్టు 15న నాలుగు గంటలపాటు ట్రెక్కింగ్ చేసి, మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని చేరుకున్నారు. తాజాగా భారత్‌కు తిరిగి వచ్చిన ఆమె తన అనుభవాలను పీటీఐతో పంచుకున్నారు. 'పర్వతాలను అధిరోహించాలని కాలేజీ సమయంలో కలలుకనేదాన్ని. నా కుటుంబసభ్యుల



ప్రోత్సాహంతో వాటిని నిజం చేసుకోగలుగుతున్నా. హిమాలయాలలోని పలు ప్రాంతాలతో పాటు కశ్మీర్, లద్ధాఖ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని పలు పర్వతాలను ఎక్కాను. మౌంట్ కిలిమంజారోనూ అధిరోహించాను. ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడమే నా ఆశయం. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నమ్ముతాను. ఒక ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని సాధించేటప్పుడు వయసు కంటే పట్టుదల, క్రమశిక్షణే ముఖ్యం' అని శివానీ పేర్కొన్నారు.

## ఆ యువరాణితో బిలావల్ భుట్టో వివాహం..?

పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ త్వరలో వివాహం చేసుకోనున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆస్ట్రియా చివరి చక్రవర్తి చార్లెస్ 1 మునిమనవరాలిని ఆయన పెళ్లి చేసుకుంటారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. భుట్టో తండ్రి, పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఏడు రోజుల ప్రైవేటు పర్యటనలో భాగంగా యూరప్‌కు వెళ్లడంతో ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఆసిఫ్ అలీ జర్దారీ వ్యక్తిగత పర్యటన నిమిత్తం విదేశాలకు వెళ్లినట్లు ఆగస్టు 27న పాక్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆయన ఎక్కడికి, ఎందుకు వెళ్లారనే విషయాలను మాత్రం వెల్లడించలేదు. ఇదే సమయంలో బిలావల్ వివాహానికి ఏర్పాట్లు, అధ్యక్షుడి పర్యటనతో ముడిపెడుతూ పాక్ మీడియాలోనూ కథనాలు వచ్చాయి. అయితే, వీటిని పీపీపీ నేత, కరాచీ మేయర్ ముర్తాజా వహాబ్ తోసిపుచ్చారు. ఆ వార్తల్లో నిజం లేదని, నిరాధారమైనవని అన్నారు. దీనిపై జర్దారీ కుటుంబం నుంచి కూడా ఎటువంటి ప్రకటనా రాలేదు.



## నేపాల్ వరదలు: 1,643 మంది పిల్లలను కాపాడిన టీచర్ సమయస్ఫూర్తి..!

నేపాల్‌లో బుధవారం మొదలైన వరదలు వందల మందిని బలిగొన్నాయి. ఇప్పటికీ అనేక మంది ఆచూకీ తెలియకపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విధ్వంసం సమయంలోనూ ఓ టీచర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి.. 1643 మంది చిన్నారులను కాపాడిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. నేపాల్‌లోని త్రిశూలి ప్రాంతంలోని త్రిభువన్ త్రిశూలి సెకండరీ స్కూల్ టీచర్ రాజేంద్ర దవాడికి బుధవారం ఉదయం



వరద హెచ్చరిక అందింది. వెంటనే స్పందించిన టీచర్ స్కూల్‌లో అలారం మోగించి, ఇతర ఉపాధ్యాయుల సహాయంతో పాఠశాలలోని 1,643 మంది విద్యార్థులను ఒకచోటుకు చేర్చారు. స్కూల్ బస్సు డ్రైవర్లనూ అలర్ట్ చేశారు. విద్యార్థులను బస్సులలో సురక్షిత ప్రాంతానికి తరలించడానికి ప్రయత్నించారు. అప్పటికే స్థానికంగా ఉన్న రోడ్లు, భవనాలు కొట్టుకుపోతుండడంతో దగ్గరలోని మరో సురక్షిత ప్రాంతానికి తరలించాలని నిర్ణయించుకున్నారు. వెంటనే పాఠశాలకు సమీపంలోని ఎత్తైన ప్రదేశంలో ఉన్న ఓ భారీ వృక్షం కిందకు తరలించారు. అనంతరం కొన్ని నిమిషాల వ్యవధిలోనే.. భారీ వరద ధాటికి మూడు అంతస్తుల పాఠశాల భవనం కొట్టుకుపోయింది. ఈ విపత్తులో ఇద్దరు పాఠశాల సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అప్రమత్తంగా వ్యవహరించిన టీచర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అభినందిస్తున్నారు.

## గెయిల్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీక్..
## 24కిలో మీటర్ల మేర ట్రాఫిక్ మళ్లింపులు

గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీక్ అవడంతో 24 కిలో మీటర్ల మేర ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ ఘటన మహారాష్ట్ర లోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఉన్న గెయిల్ పైప్‌లైన్ లీక్ అవుతుండడాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ఘటనా స్థలంలో అగ్నిమాపక పరికరాలను సిద్ధం చేసింది. పైప్ లైన్ రెండు వైపులా ఉన్న వాల్వ్‌లను మూసివేయడానికి నిపుణులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్‌ను ధూలే



సోలాపూర్ హైవే వైపు మళ్లించారు. నాగ్‌పుర్ నుంచి ముంబయి వెళ్లే దారిలో కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.



## సైప్రస్‌లో..270 మందితో వెళ్తున్న పడవ బోల్తా

సైప్రస్‌లో పడవ ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర సైప్రస్‌లోని కైరేనియా నుంచి తుర్కియేలోని టౌచుకు సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తుండగా బోల్తా పడింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. దాదాపు 159 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగాయి. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కైరేనియా మేయర్ మురాత్ సెన్‌కుల్ వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటనలో భారీ ప్రాణనష్టం జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. కోస్టు గార్డుకు చెందిన పడవలు, హెలికాప్టర్లు సహా ప్రయాణికుల పడవలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. బాధితులను ఆసుపత్రులకు చేర్చేందుకు తీరంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. అయితే, ప్రమాద సమయంలో పడవలో కచ్చితంగా ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు.

## మిళ కూటమిలో ముసలం.. సీఎం విజయ్ 'ప్రధాని' ప్రచారంతో కాంగ్రెస్‌లో కలవరం

- **తమిళనాడులో అధికార టీవీకే-కాంగ్రెస్ కూటమిలో పొడచూపిన విభేదాలు**
- **సీఎం విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రచారం చేయడమే అసలు కారణం**
- **ఈ ప్రచారంపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తి, గందరగోళం**
- **మోదీని ఎదుర్కోవడంలో రాహుల్‌కు ఎవరూ సాటిరారన్న కాంగ్రెస్ ఎంపీ**
- **సమయం వచ్చినప్పుడు విజయ్ నిర్ణయం తీసుకుంటారని టీవీకే మంత్రి వ్యాఖ్య**




తమిళనాడులో అధికారంలో ఉన్న 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే), దాని మిత్రపక్షం కాంగ్రెస్ మధ్య రాజకీయ విభేదాలు బహిర్గతమవుతున్నాయి. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌ను దేశ ప్రధాని అభ్యర్థిగా చిత్రీకరిస్తూ కొందరు టీవీకే నేతలు, మద్దతుదారులు చేస్తున్న ప్రచారం కూటమిలో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. విజయ్‌ను ప్రధానిగా ప్రొజెక్ట్ చేస్తూ సాగుతున్న ఈ ప్రచారం వెనుక పార్టీ నాయకత్వాన్ని ఆకట్టుకోవాలనుకునే కొందరు టీవీకే నేతల ప్రయత్నం ఉన్నప్పటికీ, ఇది కూటమి జాతీయ రాజకీయ వైఖరిపై గందరగోళం సృష్టిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. తొలుత అసెంబ్లీలో మంత్రులు, ఎమ్మెల్యేలు విజయ్‌పై ప్రశంసలకే పరిమితమైన ఈ అంశం, ఇప్పుడు బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, ఉత్తర భారతదేశంలో ప్రచార వీడియోల రూపంలోకి విస్తరించింది. ఇది బీజేపీకి ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల ఓ టెలివిజన్ ఛానల్ నిర్వహించిన సర్వే ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. ప్రధాని అభ్యర్థిగా ఎవరికి మద్దతిస్తారని అడిగిన ప్రశ్నకు, రాహుల్ గాంధీ తర్వాత 9 శాతం మద్దతుతో విజయ్ మూడో స్థానంలో నిలిచారు. టీవీకేకాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రచారం చేయడంపై కాంగ్రెస్ నేతలు అసహనంగా ఉన్నారు. మంత్రులు అభిమానుల్లా వ్యవహరిస్తున్నారని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ ఇటీవల చేసిన విమర్శలు ఈ అసంతృప్తిని స్పష్టం చేస్తున్నాయి. గతంలో రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా సమర్థించిన డీఎంకేతో పొత్తును వదులుకుని కాంగ్రెస్ పార్టీ టీవీకేతో చేతులు కలపడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలు కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారాయి. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి మాట్లాడుతూ, విజయ్ ప్రచారం ఒక ఎన్నికల వ్యూహమేనని, అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడంలో రాహుల్ గాంధీకి ఎవరూ సాటిరారని స్పష్టం చేశారు. ఈ వివాదంపై శనివారం మధురైలో రాష్ట్ర మంత్రి నిర్మల్ కుమార్ స్పందిస్తూ.. విజయ్ పట్ల దేశవ్యాప్తంగా ప్రజలకు ఆకాంక్షలు ఉన్నాయని, రాజకీయ పరిస్థితులను బట్టి సీఎం విజయ్ సరైన నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ అంశంపై ఇప్పుడు చర్చ అనవసరమని ఆయన అన్నారు. వాస్తవానికి జాతీయ స్థాయిలో రాహుల్‌ను ముందుంచి, దక్షిణాదిలో విజయ్ ప్రజాదరణను ఉపయోగించుకోవాలన్నది కాంగ్రెస్ వ్యూహం. కానీ, తాజా పరిణామాలతో ఆ వ్యూహం దెబ్బతిని, కూటమి భవిష్యత్తు, నాయకత్వ ప్రాధాన్యతలపై నీలినీడలు కమ్ముకున్నాయి.




# ఈ వారమూ ఐపీఓల సందడి..

## 7 ఇష్యూలు.. 8 లిస్టింగ్‌లు

ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ ఐపీఓల సందడి కొనసాగనుంది. మెయిన్‌బోర్డు, ఎస్ఎంఈ కేటగిరీలో మొత్తం ఏడు కంపెనీలు సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. దీంతో పాటు ఎనిమిది మెయిన్‌బోర్డు ఐపీఓలు స్టాక్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఆ వివరాలు చూసేద్దాం.. పర్పుల్ స్టైల్ ల్యాబ్స్ ఐపీఓ ఆగస్టు 31న సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. సెప్టెంబర్ 2న ముగియనుంది. పూర్తి ఫ్రెష్ ఇష్యూ రూపంలో రూ.680 కోట్లు కంపెనీ సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.546రూ.575గా నిర్ణయించింది.

* రేస్ ఆఫ్ బిలీఫ్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభమై 3న ముగియనుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.125 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.227 రూ.239గా నిర్ణయించింది.
* దీపా జువెలర్స్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభమై 3న ముగుస్తుంది. మొత్తం రూ.459.72 కోట్లు సమీకరించనుంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ జరగనుంది. ధరల శ్రేణిని రూ.168 177గా కంపెనీ నిర్ణయించింది.




* ఎస్ఎంఈ కేటగిరీలో: అశుతోష్ ఫైబర్ ఐపీఓ (రూ.56.35 కోట్లు) శాంతి ఇనార్గానిక్స్ (రూ.47.24 కోట్లు), ఫైకెమ్ టెక్నాలజీస్ (రూ.14.58 కోట్లు) ఐపీఓలు ఆగస్టు 31న సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. ఫార్మ్‌పీస్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభం కానుంది. రూ.32 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది.
* లిస్టింగ్‌లు ఇవీ: మెయిన్‌బోర్డు కేటగిరీలో అగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్, హై టెక్ ఇంజినీర్స్ లిమిటెడ్, స్కైవేస్ ఎయిర్‌సర్వీసెస్, సింబియోటెక్ ఫార్మాలాబ్, అన్ను ప్రాజెక్ట్స్, లుమినో ఇండస్ట్రీస్, ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ప్రయారిటీ జువెల్స్ ఈ వారం లిస్ట్ కానున్న కంపెనీల జాబితాలో ఉన్నాయి.

# ఎఫ్‌డీ చేసినా నగదు అందుబాటులో

ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) సురక్షితమైన పెట్టుబడిగా కనిపిస్తుంటాయి. కేవలం అధిక వడ్డీ లభిస్తుందనే ఆశతో డబ్బు మొత్తాన్ని దీర్ఘకాలిక వ్యవధికి ఎఫ్‌డీ చేయడం ఆర్థికంగా కొన్నిసార్లు ఇబ్బంది కలిగించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వ్యవధి తీరకముందే వెనక్కి తీసుకోవాల్సి వస్తే చేతికి తక్కువ రాబడి అందుతుంది. అందుకే, గరిష్ఠ వడ్డీని సాధిస్తూనే, చేతిలో నగదుకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలి. మీ వద్ద ఉన్న పూర్తి పెట్టుబడి నిధిని ఒకే పెద్ద ఎఫ్‌డీలో ఉంచే బదులు, విభిన్న మెచ్యూరిటీ కాలాలు ఉండేలా విడగొట్టాలి. ఉదాహరణకు, రూ.10 లక్షల మొత్తాన్ని రూ.2 లక్షల చొప్పున అయిదు ఎఫ్‌డీలుగా మార్చి వేర్వేరు గడువులతో పెట్టుబడి పెట్టాలి. దీనివల్ల క్రమమైన వ్యవధిలో కొంత నగదు చేతికి అందుతూ ఉంటుంది. మిగిలిన మొత్తం వడ్డీని ఆర్జిస్తూనే ఉంటుంది.

# ఓటింగ్‌లో పాల్గొన్నవి సుభాష్ చంద్ర అనుబంధ కంపెనీలే!

* **ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులపై బ్యాంకులు**

దిల్లీ: ఎస్సెల్‌గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్‌చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియపై వివాదం కొనసాగుతోంది. రూ.22,006 కోట్ల క్లెయిమ్‌నకు గానూ రూ.6.5 కోట్లు మాత్రమే చెల్లించేందుకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ అనుమతించడంపై రుణాలు ఇచ్చిన బ్యాంకులు గుర్రుమంటున్నాయి. రుణ పరిష్కార ప్రణాళికకు ఆమోదం తెలిపిన క్రెడిటర్లకు సుభాష్ కుటుంబంతో సంబంధం ఉందని ఆరోపిస్తున్నాయి. సుభాష్ చంద్రపై దాఖలైన వ్యక్తిగత దివాలా ప్రక్రియలో భాగంగా క్రెడిటర్లంతా కలిసి రూ.22,006.57 కోట్లు క్లెయిమ్ చేయగా.. కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే పరిష్కార ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికకు 80.81 శాతం క్రెడిటర్ల నుంచి ఆమోదం లభించడం గమనార్హం. అయితే, ఇందులో సుభాష్ చంద్ర కుటుంబంతో సంబంధం ఉన్న 5 సంస్థలు రుణదాతల కమిటీలో 61.78 శాతం ఓటింగ్ వాటాను కలిగి ఉన్నాయని, ఈ ప్రణాళిక ఆమోదించడంలో కీలక పాత్ర పోషించాయని బ్యాంకులు ఆరోపిస్తున్నాయి. వీణా ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, డైరెక్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, వరల్డ్ క్రెస్ట్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, లెమనేడ్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, కార్ప్‌కాల్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ



కంపెనీలకు అధిక ఓటింగ్ వాటా ఉండడంతో ఇది సాధ్యమైందని బ్యాంకులు పేర్కొంటున్నాయి. వీణా ఇన్వెస్ట్‌మెంట్స్ అనేది సుభాష్ చంద్ర సుభాష్ చంద్ర సోదరుడి భార్య సుశీలాదేవి గోయల్ నిర్వహిస్తున్నారని; అలాగే, డైరెక్ట్‌మీడియా, వెంచర్స్, వరల్డ్ క్రెస్ట్ కూడా వాటి అనుబంధ సంస్థలని పేర్కొంటున్నాయి. దివాలా ప్రక్రియ నిబంధనల ప్రకారం అనుబంధ సంస్థలకు ఓటింగ్ హక్కులు ఉండకూడదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ ట్రస్టీషిప్ సర్వీసెస్ వాదించాయి. దీనిపై ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో కేసు మూడో సభ్యుడైన నీలేష్ శర్మ వద్దకు చేరింది. అయితే, రుణగ్రహీతకు ప్రత్యక్షంగా 51 శాతం కంటే ఎక్కువ వాటా లేదా బోర్డు నియంత్రణ ఉంటేనే అనుబంధ సంస్థగా పరిగణించవచ్చని పేర్కొంటూ బ్యాంకుల అభ్యంతరాలను తిరస్కరించి, పరిష్కార ప్రణాళికకు ఆయన ఆమోదం తెలిపారు.

**తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బ్యాంకులు**

రుణంలో మొత్తం 3.2 శాతం వాటా కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళతామని పేర్కొంది. ప్రభుత్వరంగ బ్యాంకులైన కెనరా బ్యాంక్ (1.60%), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.76%), ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ (6.09%) కూడా ఈ ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తాము కూడా అప్పీల్‌కు వెళతామని ప్రకటించాయి.

# ఈఎంఐ 40 శాతం దాటొద్దు




నెలకు వచ్చే నికర ఆదాయంలో అన్ని రుణాలకు చెల్లించే వాయిదాలు ఎంత అన్నది ఆర్థిక ప్రణాళికలో ఎంతో కీలకం. చాలామంది ఆదాయం వస్తుంది కదా అని.. అదే పనిగా రుణాలు తీసుకుంటూ వెళ్తుంటారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదు. సాధించాల్సిన ఆర్థిక లక్ష్యాలను ఇది దూరం చేస్తుంది. సొంతిల్లు, కారు, ఉన్నత చదువులు... ఇలా కొన్నింటిని రుణాల సాయంతో సొంతం చేసుకోవడం సాధారణ విషయం. నెలకు వచ్చే నికర ఆదాయంలో అన్ని రుణాల వాయిదాలు కలిసి 3540 శాతానికి మించకుండా చూసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. రుణ చెల్లింపుల పరిమితిని పాటించడం వల్ల అత్యవసర నిధి, పొదుపు, దీర్ఘకాలిక లక్ష్యాలకు తగినంత నగదు అందుబాటులో ఉంటుంది. వ్యక్తిగత లేదా ఆర్థిక పరిస్థితులు మారినప్పుడు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు క్రమశిక్షణతో కూడిన అప్పుల నిర్వహణ ఎంతో అవసరం. లేకపోతే కుటుంబ బడ్జెట్‌పై నిరంతర భారాన్ని మోపుతుంది. క్రెడిట్ కార్డు బాకీలు, కారు రుణాలు, విద్యా రుణం, ఇంటి రుణం ఇలా అన్ని ఈఎంఐల మొత్తాన్ని ఒకే దగ్గర చూడకుండా.. విడివిడిగా లెక్కించడం చాలామంది చేసే పొరపాటు. చెల్లించే వాయిదాలు ఆదాయంలో ఎక్కువ భాగాన్ని తీసుకుంటే, ఊహించని ఖర్చులు తట్టుకోవడం, క్రమం తప్పకుండా పెట్టుబడులు కొనసాగించడం కష్టమవుతుంది. అందువల్ల కొత్త అప్పు తీసుకునే ముందు మొత్తం ఆదాయం, రుణ నిష్పత్తిని స్పష్టంగా పరిశీలించుకోవాలి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు క్రెడిట్ స్కోరు, ఆదాయం ఆధారంగా ఇచ్చే గరిష్ఠ రుణ పరిమితి మీ వ్యక్తిగత ఆర్థిక పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదు. బ్యాంకు ఇచ్చే రుణ పరిమితి ఒక సరిహద్దు మాత్రమే. దానిని పూర్తిగా తీసుకోవడం వల్ల, మీ భవిష్యత్తు ఆర్థిక స్వేచ్ఛను కొన్నేళ్లపాటు తీవ్రంగా ప్రభావితం చేయొచ్చు. బ్యాంకులు ఇచ్చే గరిష్ఠ పరిమితికి బదులు రోజువారీ జీవనశైలికి, పొదుపు, పెట్టుబడులకు తగినంత డబ్బు మిగుల్చుకుంటూ, రుణ వాయిదాను సులభంగా చెల్లించగలిగిన మేరకే అప్పు తీసుకోవడం మంచి పని. మారుతున్న ఖర్చులు, భవిష్యత్తు ఆర్థిక సవాళ్లు కాలం గడుస్తున్న కొద్దీ మారుతూనే ఉంటాయి. కుటుంబ అవసరాలు, తల్లిదండ్రుల సంరక్షణ, ఉద్యోగంలో మార్పులవంటివి నెలవారీ నగదు ప్రవాహాన్ని ఊహించని విధంగా మారుస్తాయి. ఇప్పటికే గరిష్ఠ స్థాయిలో ఈఎంఐలు ఉంటే, ఇలాంటి మార్పులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి దారితీస్తాయి. ఈఎంఐల మొత్తాన్ని 40 శాతంకంటే తక్కువగా ఉంచుకోవడం వల్ల ఆదాయం తగ్గినప్పుడు లేదా ఖర్చులు పెరిగినప్పుడు ఇది ఒక రక్షణ కవచంలాగా పనిచేస్తుంది. అధిక వడ్డీకి తీసుకున్న రుణాలు మనపై దీర్ఘకాలిక భారాన్ని మోపుతాయి.

# 'ఆ విషయంపై మాట్లాడొద్దు'.. పాక్ క్రికెటర్లకు పీసీబీ సూచన

మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలుశిక్ష విషయంపై పాకిస్థానీ క్రికెటర్లు ఎలాంటి వ్యాఖ్యలూ చేయొద్దని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సూచించింది. పాక్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ఆడుతోంది. ఇమ్రాన్ వ్యవహారంపై పాక్ క్రికెటర్లు స్పందించేలా బ్రిటిష్ మీడియా ప్రయత్నించిన నేపథ్యంలో పీసీబీ ఈమేరకు సూచన చేసింది. ఇమ్రాన్ ఖాన్ మూడేళ్లుగా జైలులో నరకం అనుభవిస్తున్నారని ఆయన కుమారులు ఇటీవల ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైక్ అథర్టన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించిన వేళ ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇమ్రాన్ కుమారుల




ఇంటర్వ్యూను ఆటగాళ్లు చూశారా? అని పాక్ ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను విలేకరులు అడిగారు. ఆటగాళ్లు భోజనం చేస్తూ ఉండటంతో దానిని చూడలేదని సర్ఫరాజ్ మీడియాతో అన్నాడు. మరోవైపు, రావల్పిండి జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం కూడా క్షీణించినట్లు అంతకుముందు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ అయిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై క్రికెట్ ప్రపంచం కూడా స్పందించింది. ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని సునీల్ గావస్కర్, గ్రెగ్ ఛాపెల్‌తో సహా దాదాపు 21 మంది మాజీ కెప్టెన్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లేఖ రాశారు. ఆస్ట్రేలియా క్రికెటర్ ప్యాట్ కమిన్స్ కూడా తన మద్దతును తెలియజేశాడు.

# తొలి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ.. శ్రీలంకకు ఐసీసీ బిగ్ షాక్!

మహిళా క్రికెట్‌లో తొలిసారి ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు ఐసీసీ సన్నద్ధమవుతోంది. వచ్చే ఏడాది ఈ ట్రోఫీ ఉండనుంది. ఇందులో ఆరు జట్లు తలపడతాయి. శ్రీలంక క్రికెట్ బోర్డు ఆతిథ్యంలో ఈ టోర్నీ జరుగుతుందని తొలుత వార్తలు వచ్చాయి. కానీ, ఇప్పుడు ఐసీసీ తన నిర్ణయాన్ని మార్చుకోనుందని తెలుస్తోంది. కొత్త వేదికను వచ్చే ఐసీసీ బోర్డు సమావేశంలో నిర్ణయించే అవకాశం ఉంది.

**మా నుంచి వెళ్లిపోయినట్లే: శ్రీలంక బోర్డు**

"అవును.. శ్రీలంక ఆతిథ్య హక్కులను కోల్పోయినట్లే. మరో వేదికగా మ్యాచులు జరిగే అవకాశం ఉంది. ఎక్కడ అనేది మాత్రం చెప్పలేను" అని శ్రీలంక బోర్డు తాత్కాలిక కమిటీ కార్యదర్శి ప్రకాశ్ షఫ్తెర్ తెలిపారు. శ్రీలంక బోర్డును ప్రభుత్వం నియమించిన తాత్కాలిక అడ్మినిస్ట్రేషన్ నడిపిస్తోంది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. సభ్య దేశాల పాలక మండలిలో ప్రభుత్వాల జోక్యం ఉండకూడదు. దీంతో ఐసీసీ (ICC) బోర్డు సమావేశాల్లోనూ శ్రీలంక ప్రతినిధులకు అనుమతి లేదు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని శ్రీలంకకు ఐసీసీ సూచించింది. ఇప్పటికే శ్రీలంక క్రీడా శాఖకు తాత్కాలిక కమిటీ రాజ్యాంగ ముసాయిదాను సమర్పించింది. అయితే, దానిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన తర్వాతనే శ్రీలంక బోర్డుకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ అంత త్వరగా పూర్తయ్యేలా కనిపించడం లేదు.

* **ఇదే తొలిసారి.. ఆ ఛాన్స్ మిస్ కానుందా?**

వేదిక మాత్రమే కాకుండా.. ఇందులో తలపడే అవకాశమూ కోల్పోయే ప్రమాదంలో శ్రీలంక ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ఆరు టీమ్‌లు ట్రోఫీ కోసం బరిలోకి దిగుతాయి. ఈ క్రమంలో శ్రీలంక ఆతిథ్యం ఇవ్వకపోతే ఆడటమూ కష్టమే. ఇక్కడ తలపడాలంటే ఐసీసీ ర్యాంకుల్లో టాప్ 5తోపాటు ఆతిథ్య జట్టుకు ఆరో స్థానం




దక్కనుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లు తొలి ఐదు ర్యాంకుల్లో ఉన్నాయి. కొత్త వేదిక ఇందులో ఒకటి అయితే ఫర్వాలేదు.. అప్పుడు శ్రీలంకకు ఆరో ర్యాంకర్‌గా ఛాన్స్ వస్తుంది. అలా కాకుండా వేరే చోట అంటే.. వెస్టిండీస్, ఐర్లాండ్, జింబాబ్వే, యూఏఈలో ఏదైనా హోస్ట్ అయితే మాత్రం లంకకు దారులు మూసుకుపోయినట్లే. అప్పుడు ఆ ఆరో టీమ్ లక్ సదరు ఆతిథ్య జట్టుకు వస్తుంది.

# కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ.. నాయకత్వ బాధ్యతల్లోకి యువ సంచలనం

టీమ్ఇండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అప్పుడే కెప్టెన్ అయిపోయాడు. అదీనూ ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో హేమాహేమీ ఆటగాళ్లు ఉన్న ఈస్ట్ జోన్ జట్టుకు నాయకత్వం బాధ్యతలను స్వీకరించాడు. అదేంటి ఇషాన్ కిషన్‌కు అతడిని డిప్యూటీగా చేశారు కదా.. అనే సందేహం రాకమానదు. అవునండి.. సూర్యవంశీ వైస్ కెప్టెనే. కాకపోతే సెంట్రల్ జోన్‌తో జరుగుతోన్న సెమీస్‌లో ఇషాన్‌కు గాయమైంది. దీంతో అతడు మైదానం వీడాడు. మరి జట్టును నడిపించే బాధ్యతలు ఎవరికి వస్తాయి? ఆటోమేటిక్‌గా ఉప



సారథికేగా. అలా ఈస్ట్‌జోన్ కెప్టెన్‌గా వైభవ్ విధులు నిర్వర్తిస్తున్నాడన్నమాట.

**సీనియర్లను ముందుకు నడిపిస్తూ..**

ఈస్ట్‌జోన్ జట్టులో సీనియర్ పేసర్ మహ్మద్ షమీతోపాటు ముకేశ్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్, కుమార్ కుషాంగ్రా, అనుకుల్ రాయ్ వంటి ఆటగాళ్లను వైభవ్ ముందుండి నడిపిస్తున్నాడు. టాస్ గెలిచిన ఈస్ట్ జోన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కాసేటికే ఇషాన్ గాయంతో మైదానం వీడాడు. అయితే, షమీ పదునైనా బౌలింగ్‌తో ఆకట్టుకోగా.. అభిజిత్ సర్కార్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ తీశారు. అనుకుల్ రాయ్ కూడా పొదుపుగా బౌలింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతం తొలి రోజు లంచ్ బ్రేక్ సమయానికి సెంట్రల్ జోన్ 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. కెప్టెన్ రజత్ పాటీదార్ (12) నిరాశ పరిచాడు.




# మహిళల ఆసియా కప్.. భారత్ శుభారంభం

దుబాయ్: మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం చేసింది. థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 160 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన థాయ్‌లాండ్ .. 16.1 ఓవర్లలో 65 పరుగులకే ఆలౌటైంది. కొంచారోయింక్టై 41 రన్స్ చేసింది. మిగతా బ్యాటర్లెవరూ అంతగా రాణించలేదు. భారత బౌలర్లలో నందనీ శర్మ, దీప్తిశర్మ చెరో 3 వికెట్లు పడగొట్టారు. క్రాంతి గౌడ్ ఒక వికెట్, శ్రీచరణి 2 వికెట్లు తీశారు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షెఫాలి వర్మ



(64; 36 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకం బాదింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీకా రావల్ (22; 18 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3, సునిద 2, పుత్తవాంగ్, చనిదా తలో వికెట్ తీశారు.

# కవలలు పుట్టినప్పుడు.. టెన్నిస్‌ను వదిలేస్తానన్నాడు: రోజర్ ఫెదరర్ భార్య మిర్కా

రోజర్ ఫెదరర్.. టెన్నిస్ ప్రపంచానికి పరిచయం అక్కర్లేని పేరు. హాల్ ఆఫ్ ఫేమ్‌లో అతడికి చోటు లభించిన సంగతి తెలిసిందే. శనివారం రాత్రి జరిగిన ఈవెంట్‌లో ఫెదరర్‌తోపాటు అతడి భార్య మిర్కా ఫెదరర్ హైలైట్‌గా నిలిచారు. హాల్ ఆఫ్ ఫేమ్‌లో తన భర్త చేరడంపై చేసిన మిర్కా ప్రసంగం ఆకట్టుకుంది. కేవలం ఆటకు సంబంధించి మాత్రమే కాకుండా.. వ్యక్తిగత బంధం, కుటుంబ విలువల విషయంలో రోజర్ తీరును ప్రస్తావించారు. ఈ సందర్భంగా రోజర్ కూడా కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారిని కదిలించింది. ఇద్దరూ 2000 ఒలింపిక్స్ సమయంలో తొలిసారి కలిసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మిర్కా తన ఉపన్యాసాన్ని మొదలు పెట్టారు. అప్పటికి మిర్కాకు 21 ఏళ్లు కాగా.. ఫెదరర్‌కు 18 ఏళ్లు మాత్రమే. 'అవును.. నేను నీకంటే పెద్దదాన్నే కదా' అని మిర్కా అనగానే రోజర్ కూడా నవ్వేశాడు. "వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే అని రోజర్ అప్పుడే అనుకున్నట్లున్నాడు.



అతను పట్టువదలని వ్యక్తి. అదే మమ్మల్ని కలిపింది. మేమిద్దరం కలిసే నాటికి ఒక్క ఏటీపీ టైటిల్‌ను కూడా రోజర్ గెలవలేదు. సున్నానే అనుకుంటా. ఇప్పుడు 103కి చేరాడు. అన్నింటిల్లోనూ అతడికి తోడుగా ఉన్నాననుకుంటున్నా" ప్లేయర్స్ బాక్స్‌లో ఉన్న టెన్నిస్ స్టార్ ఆండీ రాడిక్ స్పందిస్తూ.. 'అంటే.. నేను ఓ అమ్మాయి ప్రేరేపించిన వ్యక్తి చేతిలో ఓడిపోయానన్నమాట. ఇప్పటికీ నమ్మలేకపోతున్నా' అని సరదాగా వ్యాఖ్యానించాడు.

## సినిమా



## రీమేక్ మూవీలో శ్రీకృష్ణుడి పాత్ర

లో బడ్జెట్‌తో తెరకెక్కిన గుజరాతీ మూవీ లాలో కృష్ణ సదా సహాయతే తెలుగులోకి రీమేక్ కానుంది. ఇందులో శ్రీకృష్ణుడిగా టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ నటించనున్నట్లు తెలిసింది. ఓ యంగ్ హీరో ప్రధాన పాత్రలో నటిస్తుండగా విజయ్ గెస్ట్‌గా కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా రీమేక్ రైట్స్‌ను ప్రముఖ నిర్మాత దిల్‌రాజు దక్కించుకున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ రీమేక్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు తెలిసింది. కేవలం 50 లక్షల బడ్జెట్‌తో రూపొందిన ఈ గుజరాతీ మూవీ రూ.120 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఆర్థిక ఇబ్బందులతో తప్పులు చేసిన ఓ ఆటో డ్రైవర్‌లో శ్రీకృష్ణుడు ఎలా మార్పు తీసుకొచ్చాడనే పాయింట్‌తో తెరకెక్కించారు. అంకిత్ సఖియా దర్శకత్వం వహించాడు.



## చిక్కుల్లో రంభ ఊర్వశి మేనక

అల్లరి నరేష్ రంభ ఊర్వశి మేనక మూవీ రిలీజ్‌కు ముందే చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో విష్ణుప్రియ, రాశీసింగ్‌తో పాటు ప్రిషా సింగ్ పాత్రలను చూపించిన విధానంపై సెన్సార్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. వారి పాత్రలకు సంబంధించిన డైలాగ్స్ విషయంలో చాలానే మార్పులు సూచించినట్లు చెబుతున్నారు. సెన్సార్ అడ్డంకుల కారణంగా ఈ సినిమా రిలీజ్‌పై అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. సెప్టెంబర్ 4న విడుదల కావాల్సిన ఈ మూవీ వాయిదాపడే అవకాశాలున్నాయని అంటున్నారు. సెన్సార్ అభ్యంతరాలపై మేకర్స్ రివైజింగ్ కమిటీకి వెళ్లినట్లు చెబుతున్నారు. రేపు సెన్సార్ సర్టిఫికెట్‌పై క్లారిటీ రానున్నట్లు తెలిసింది. అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి రాజేష్ దండా ఈ సినిమాను నిర్మించారు. సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాకు చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహించారు.




## ఓటీటీలోకి కొరియన్ కనకరాజు

మెగా హీరో వరుణ్‌తేజ్ బ్లాక్‌బస్టర్ మూవీ కొరియన్ కనకరాజు ఓటీటీ రిలీజ్ డేట్ కన్ఫామ్ అయ్యింది. సెప్టెంబర్ 4 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ హారర్ కామెడీ మూవీ స్ట్రీమింగ్ కాబోతుంది. ఆగస్ట్ ఫస్ట్ వీక్‌లో థియేటర్లలో రిలీజైన ఈ మూవీ పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దాదాపు 30 కోట్ల బడ్జెట్‌తో రూపొందగా 40 కోట్లకు పైగా కలెక్షన్స్ దక్కించుకుంది. ఓటీటీ, శాటిలైట్‌తో పాటు మ్యూజికల్ రైట్స్ ద్వారా మేకర్స్‌కు మరో ఇరవై ఐదు కోట్ల వరకు వచ్చినట్లు సమాచారం. నిర్మాతలకు ఈ మెగా హీరో మూవీ భారీగా లాభాలు తెచ్చిపెట్టింది. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించగా తమన్ మ్యూజిక్ అందించాడు.



## డ్రామాలు ఆడకు

మనీ లాండరింగ్ కేసులో జైలు శిక్షను అనుభవిస్తున్న సుఖేష్ చంద్రశేఖర్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని ఇటీవల బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నది. ఆమె కామెంట్లపై సుఖేష్ ఓ లేఖ ద్వారా బదులిచ్చారు. "నా దగ్గర నుంచి ఎప్పుడూ డబ్బు తీసుకోలేదని అబద్ధాలు చెబుతున్నావు. నేను ఇచ్చిన కోట్ల రూపాయల డబ్బుతోనే మొరాకోలోని కాసాబ్లాంకాలో నువ్వు ఇల్లు కొనుగోలు చేసింది నిజం కాదా? ఆ టైమ్‌లో మన మధ్య జరిగిన చాటింగ్ ఇప్పటికీ నా వద్ద ఉంది. నువ్వు చెప్పేవి నిజాలే అయితే ఆ మెసేజ్‌లు అందరికి చూపించు. బాధితురాలినంటూ సింపథీ కోసం డ్రామాలు ఆడుతుంది. ఆమెకు ఓ బీ ఎండబ్ల్యూ కారు గిఫ్ట్‌గా ఇస్తే లవ్ యూ బ్యాడ్ బాయ్ అంటూ మెసేజ్ పంపించింది. జాక్వెలిన్ ఫెర్నేండేజ్‌తో సన్నిహితంగా ఉండటం నోరా తట్టుకోలేకపోయింది. అంటే సుఖేశ్ ఆ లేఖలో రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఈ లెటర్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది.



## విజయ్ మాల్యా జీవితంపై వెబ్‌సిరీస్

బ్యాంకులకు వేట కోట్లు ఎగవేసి విదేశాలకు పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా జీవితం ఆధారంగా ఓ వెబ్‌సిరీస్ రాబోతుంది. బిలియనీర్ పేరుతో తెరకెక్కుతోన్న ఈ సిరీస్‌లో విజయ్ మాల్యా పాత్రలో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కనిపించబోతున్నారు. బాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ హన్సల్ మెహతా, రాబీ గ్రేవాల్ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ నుంచి బిలియనీర్ షూటింగ్ మొదలుకాబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. అమెజాన్ ప్రైమ్ ఓటీటీ నిర్మిస్తున్న ఈ సిరీస్ వచ్చే ఏడాది స్ట్రీమింగ్ కాబోతుంది.



టాలీవుడ్ హీరోయిన్ సమంత త్వరలోనే మాతృత్వపు బంధంలోకి అడుగుపెట్టబోతుంది. ప్రెగ్నెన్సీ కారణంగా ప్రస్తుతం షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చింది. ఈ గ్యాప్‌ను తన మనసుకు నచ్చిన పనులతో ఆస్వాదిస్తోంది. తాజాగా బేబీ బంప్‌తో దిగిన కొత్త ఫొటోలను సమంత సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ ఫొటోలు వైరల్ అవుతోన్నాయి.